# దృశ్యమే శబ్దమైన వాడు

చూపుల కొక్కానికి తగిలిందే శబ్దం
మిగిలిందంతా నిశ్శబ్దమే
వాడి వెనక ఎంత గురిచూసి
శరపరంపరగా శబ్దాల ఫిరంగీలు పేల్చినా
నిర్వికారంగా నిర్భయంగా
నడిచిపోతూనే ఉంటాడు.
వాడి తల్లి ఎప్పుడూ
దారంతా ఇంటి గేటయి కూర్చునే ఉంటుంది.
వాడి కంటికి కనిపించని
ఏ శబ్దం కబళించిందోనని కలవరపడుతుంటుంది.

దార్లో మన చెవులేవేవో వింటుంటాయి
కళ్లింకేవేవో చూస్తుంటాయి
మెదళ్లు ఈ రెంటికీ చెందని విషయాలనేవో శోధిస్తుంటాయి
మర్నాడు పేపర్లో తప్ప ఒకరి మొహాన్నొకరు చూసుకోము
అలసి పోయిన వాడికళ్లు మాత్రం
దాటుకుంటూ వచ్చేసిన దారినంతా
వీడియో చేసి తీసుకొస్తాయి
చేతి వేళ్లు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తాయి.
వాటిలో తళుకు బెళుకులు మొహంలో ప్రతిఫలిస్తాయి.
వాడి గొంతు అర్థంకాని సంగీతాన్నేదో వినిపిస్తుంటుంది.
లోకం గోడు అంతా వాడిదే అయినట్టుంటుంది.
ఏ భాషనైనా అవలోకించే వాడి చూపులముందు
సంసారం సంపాదనకే పరిమితమైన చూపులన్నీ ఓడిపోతాయి.

మూగపోతాయి
విలవిలలాడే బాధ
విరుచుకు పడే వాడి ఆవేశం
వాడి సౌంజ్ఞ సంకేతాల భావావేశాలకు
స్పందించనప్పుడే
అర్ధం కాక అవహేళన చేసినప్పుడే

అన్నివేళలా
అన్నిదిశల నుండి
దిగ్బంధం చేసి మారణాయుధాలతో దండెత్తటానికొచ్చినట్టు
గుంపులు గుంపులుగా శబ్దాలు
మన చెవుల్లో ఎంత దూది కుక్కుకున్నా
నిశ్శబ్దం కూడా ఏదో శబ్దంలా
గింగురు మంటూనే ఉంటుంది.
తమాయించుకోలేం .. తప్పించుకొని పారిపోనూలేం.
మనల్నలా చూసి చిర్నవ్వులొలుకుతూ
అవలీలగా వాడొక్కడే వాటన్నింటినీ చీల్చుకుంటూ
చిద్విలాసంగా పోతుంటాడు.